క్లుప్తంగా

హరీశ్‌రావును కలిసిన నాయకులు



హరీశ్ రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: మాజీ మంత్రి హరీశ్‌రావును మంగళవారం ఖేడ్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు హైదరాబాద్‌కు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలను అందజేసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ మైనార్టీ రాష్ట్ర నాయకులు మొహిద్‌ఖాన్, ఖేడ్ తాజా మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ జిల్లా మాజీ సభ్యులు రవీందర్‌నాయక్, సత్యపాల్ రెడ్డి, బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు అంజయ్య, కిష్టారెడ్డి, బాసిత్, పండరి యాదవ్, అంబ్ర్యానాయక్ తదితరులు ఉన్నారు.

సబ్ రిజిస్ట్రార్లుగా సురేందర్, అఫ్జలొద్దీన్

కంది(సంగారెడ్డి): కందిలో గల జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పటాన్‌చెరు సబ్‌రిజిస్ట్రార్లు 1, 2 గా పని చేస్తున్న ఆర్.రవికాంత్, బి.శ్రీనివాస్ బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం రవికాంత్ కొడంగల్‌కు, బి.శ్రీనివాస్ పరిగికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ 1గా పనిచేసిన జే.సురేందర్, నాగర్ కర్నూలు సబ్ రిజిస్ట్రార్1గా పనిచేసిన అఫ్జలొద్దీన్ నియమితులయ్యారు.

దీపాదాస్ మున్షీని కలిసిన నీలం మధు



దీపాదాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసి దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌లను కాంగ్రెస్ నేత నీలం మధు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. అనంతరం దసరా శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో ఏఐసీసీ, పీసీసీ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ రివ్యూకు హాజరైన సందర్భంగా ఆయన్ను ఈయన కలిశారు. కార్యక్రమంలో ఏఐసీసీ తెలంగాణ సెక్రటరీ విశ్వనాథన్, పీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసాయన వ్యర్థ జలాల సేకరణ

సాక్షి ఎఫెక్ట్..

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం పారిశ్రామికవాడలో పరిశ్రమల నుంచి బయటికి వెలువడుతున్న వ్యర్థ జలాల నమూనాలను పీసీబీ అధికారులు సేకరించారు. మంగళవారం సాక్షి దినపత్రికలో కబలిస్తున్న కాలుష్య భూతం అనే కథనానికి పీసీబీ అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ రవీందర్ స్పందించారు. పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయన వ్యర్థ జలాలను సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు. నివేదిక రాగానే సదరు పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జీరో బిల్లులు అందజేస్తాం : ఏఈ

వట్‌పల్లి(అందోల్): లబ్ధిదారులకు జీరో బిల్లులు అందజేస్తామని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. అందోల్ మండలం కన్‌సాన్‌పల్లి గ్రామంలో విద్యుత్ సిబ్బంది ప్రతీనెల విద్యుత్ రీడింగ్ తీయడం లేదని, రెండు, మూడు నెలలకొకసారి కలిపి బిల్లులు ఇస్తున్నారని దీంతో గృహజ్యోతికి దూరం అవుతున్నారని ఈనెల 11న 'గుండె గుబులు బిల్లు' పేరిట సాక్షి దినపత్రిక కథనం ప్రచురించింది. ఈ విషయమై విద్యుత్ అధికారులు స్పందించారు. నెలనెలా రీడింగ్ తీయకపోవడంపై వేలల్లో బిల్లులు వచ్చిన లబ్ధిదారులు వాటిని తీసుకొని తమను సంప్రదిస్తే జీరో బిల్లులు అందజేస్తామన్నారు. ఇప్పటికే పలువురికి వాటిని అందజేశామని తెలిపారు.

కార్యదర్శిగా సుభాష్‌రావు బాధ్యతల స్వీకరణ

నారాయణఖేడ్: సంజీవన్‌రావుపేట పంచాయతీ కార్యదర్శిగా సుభాష్‌రావు మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. మాణిక్‌నాయక్ తండా పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. అయితే గ్రామస్తులకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మిపై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేయడం విదితమే.

బెంబేలెత్తిస్తున్న వీధికుక్కలు





గొల్లగూడెం కాలనీలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

- గుంపులుగా సంచారం
- భయాందోళనలో ప్రజలు

సంగారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారులు, వీధుల్లో కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పట్టణంలో ఉన్న పలు కాలనీల్లో ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై చెత్త దర్శనమిస్తోంది. దీంతో ఇవి చెత్తను కదిలిస్తూ సమూహాలుగా సంచారిస్తున్నాయి. మరో వైపు పగలు ఒంటరిగా వెళ్తున్న వారిని వెంబడిస్తున్నాయి. రాత్రిళ్లు ఏమో వాహనాల వెంట పరిగెడుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కుక్కల బెడద నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కరువు

జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండ్ జిల్లాలోనే పెద్దది. ఇక్కడ మూడు రాష్ట్రాల బస్సులు వస్తుంటాయి. వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీ ఉంటున్నా.. ఇక్కడ మౌలిక సదుపాయాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదాయం బాగా వస్తున్నా కనీస సౌకర్యాలను ఎందుకు కల్పించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.



బస్టాండ్ ప్రాంగణంలో వేచి ఉన్న ప్రయాణికులు

- మూడు రాష్ట్రాల ప్రయాణికుల రాకపోకలు
- ఆదాయం బాగున్నా.. సౌకర్యాలు మృగ్యం
- ఇబ్బందుల్లో ప్రజలు

జహీరాబాద్ టౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారు. రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ బస్సులు కూడా ఇక్కడికి వస్తుంటాయి. ప్రయాణికుల రద్దీ పెరిగినప్పటికి బస్టాండ్‌లో మాత్రం అందుకు దగ్గ సౌకర్యాలు లేవు. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు డబ్బులు వెచ్చించి కొంటున్నారు. అప్పటికే మార్వాడి యువ జన మంచ్ వారు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయడం లేదు. మూత్రశాలల నిర్వహణ సైతం అధ్వానంగా ఉంది. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్నా గానీ కూర్చునేందుకు సరిపడా బెంచీలు ఏర్పాటు చేయలేదు. దీంతో నిల్చోవాల్సి వస్తోంది. కాగా, ప్రాంగణంలో ఎప్పటికప్పుడు చెత్త తొలగించడం లేదు. చెత్తాచెదారం కుప్పలుగా పేరుకునిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రయాణికులు ముక్కు మూసుకొని బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఇక్కడ కనిపిస్తోంది. అలాగే నాలుగు దశాబ్దాల క్రితం వేసిన సీసీ రోడ్డు దెబ్బతింది. ఇన్‌గేట్‌తో పాటు లోపల భాగంలో ఉన్న రోడ్డు కూడా దెబ్బతిని గుంతలు పడ్డాయి. బస్సుల రాకపోకలు సాగించేందుకు ఇబ్బంద వుతున్నా తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టడం లేదని ప్రయాణికులు పేర్కొన్నారు. బస్టాండ్‌లో తరుచూ చోరీలు జరుగుతున్నాయి.



బస్టాండ్ ఆవరణలో పేరుకుపోయిన చెత్త

ప్రయాణికుల నుంచి నగదు, బంగారాన్ని దొంగలు కొట్టివేస్తున్నారు. సీసీ కెమెరాలు లేక చోరులు పట్టుబడడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో సదుపాయాలు కల్పించాలని, దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న జాతీయ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి రూరల్: బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర ఆదేశాల మేరకు మంగళవారం సంగారెడ్డిలోని బాలసదన్‌లో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలలో అవగాహన పెంచాలన్నారు. అప్పుడే ఇవి పరిష్కారమవుతాయన్నారు. ప్రతీఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డిడబ్ల్యూఓ, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

డ్యూటీకని వెళ్లి వ్యక్తి అదృశ్యం



మధు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన రామచంద్రాపురం.. శ్రీనివాస్‌నగర్‌కాలనీలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీలో నివాసముండే మధు అమెజాన్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. రోజులాగే సోమవారం ఉదయం బాచుపల్లిలో డ్యూటీ ఉందని చెప్పి వెళ్లాడు. సాయంత్రమైనా ఎంతకీ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అతని భార్య సమీనా అతని తోటి ఉద్యోగులకు ఫోన్ చేసి విచారించగా అతను డ్యూటీకి రాలేదని తెలుసుకుంది. భర్త సెల్‌కు కాల్ చేస్తే ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో మధు స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె మంగళవారం భర్త అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంగారెడ్డికి వెళ్లి మహిళ..



ఎల్లమ్మ

సంగారెడ్డి క్రైమ్ : మహిళ అదృశ్యమైన సంఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పుల్కల్ మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన వడ్డే ఎల్లమ్మ ఈనెల 9న సంగారెడ్డి పట్టణానికి వచ్చి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఇక్కడి ప్రాంతంలో, తెలిసిన బంధువులు వద్ద వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో భార్య అదృశ్యంపై భర్త లక్ష్మణ్ పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాంకులు శుభ్రంగా ఉండాల్సిందే

- ట్రైనీ కలెక్టర్ మనోజ్

వట్‌పల్లి(అందోల్): క్రమం తప్పకుండా తాగునీటి ట్యాంకులను శుభ్రపరచాలని ట్రైనీ కలెక్టర్ మనోజ్ అన్నారు. మంగళవారం అందోల్ మండలం నాదులాపూర్, కోడెకల్, తాడ్మనూర్, గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు, పాఠశాలలు, హెల్త్ సెంటర్, గ్రామ పంచాయతీల్లో తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. దోమల నివారణకు పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా మురుగు కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా చూసుకోవాలన్నారు. అలాగే వీధి దీపాలు వెలిగేలా చూసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట రాజేశ్, ఎంపీఓ అశోక్‌కుమార్‌లు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న మనోజ్

కొత్త పట్టభద్రులకే రిజిస్ట్రేషన్ అవకాశం



సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాది హరీశ్‌కుమార్

- చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు వినతి

సదాశివపేట(సంగారెడ్డి): పట్టభద్రుల పాత ఓటరు జాబితా కొనసాగిస్తూనే కొత్త పట్టభద్రులకు రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని పట్టణానికి చెందిన న్యాయవాది నెమలికొండ హరీశ్‌కుమార్ కోరారు. మంగళవారం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సుదర్శన్‌రెడ్డికి ఆయన వినతి పత్రం అందజేశారు. 31(3) ప్రకారం పట్టభద్రుల ఓటరు జాబితాను ప్రతీ ఎన్నికల ముందు సవరించాల్సి ఉంటుందన్నారు. కానీ కొత్తగా పూర్తి జాబితాను తయారు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఒకసారి పట్టభద్రుడు అయ్యాక జీవితాంతం అర్హత ఉంటుందన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా మల్లన్నస్వామి రథోత్సవం

జహీరాబాద్: జహీరాబాద్‌కు సమీపంలోని బాల్కి తాలూకా పరిధిలో గల ఖానాపురం గ్రామంలో ప్రఖ్యాత మల్లన్నస్వామి ఉత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి పల్లకీసేవ, రథోత్సవం కార్యక్రమాలు కొనసాగాయి. ఈ ఉత్సవాల్లో కాంగ్రెస్ కర్ణాటక బీదర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఈశ్వర్‌ఖండ్రే, మాజీ మంత్రి బండెప్ప ఖాశీంపూర్, మత్స్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ మాలతీ హాజరయ్యారు. ఉత్సవాల్లో కర్ణాటకతో పాటు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

◆ ప్రభుత్వం సహకరించాలి

ఝరాసంగం(జహీరాబాద్): డీడీఎస్ సంఘం రేడియో నిర్వహణకు ప్రభుత్వ సహకరించాలని సంఘం నిర్వాహకురాలు జనరల్ నర్సమ్మ తెలిపారు. ఝరాసంగం మండలం మాచ్‌నూర్ గ్రామ శివారులోని డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ ఆవరణలో ఉన్న సంఘం రేడియో ఏర్పాటు చేసి మంగళవారం నాటికి 16 సంవత్సరాలు పూర్తి కావడంతో వేడుకలు జరుపుకొన్నారు. మహిళా సభ్యులు కేక్ కట్ చేసి, ఒకరినొకరు తినిపించుకున్నారు. డీడీఎస్ ప్రతినిధులు మంజుల, రోజమ్మ, మమత, చుక్కమ్మ, చిన్న నరసమ్మ పాల్గొన్నారు.

◆ వండటం ఓ నైపుణ్యం

పటాన్‌చెరు: వంట చేయడం ఒక నైపుణ్యమని, స్త్రీ, పురుష భేదం లేకుండా ప్రతీ ఒక్కరికి ఇది అవసరమేనని వక్తలు తెలిపారు. మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం లోని కుకింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 'మాస్టర్ చెఫ్' పోటీలను ఆద్యంతం ఉత్సాహభరితంగా నిర్వహించారు. గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ప్రధాన చెఫ్, ఆతిథ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

◆ పీపీసీ అధ్యక్షుడిని కలిసిన ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు

పటాన్‌చెరు టౌన్: పీపీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆయన్ను ఈయన కలిశారు.

రుణ పడి ఉంటాం

- వాసర్ గ్రామస్తులు
- ఎంపీ, ఎమ్మెల్యేలకు సన్మానం

నారాయణఖేడ్: తమ ప్రాంతానికి గురుకులం మంజూరు చేయించినందున ఎల్లప్పుడూ రుణ పడి ఉంటామని సిర్గాపూర్ మండలం వాసర్ గ్రామస్తులు అన్నారు. మంగళవారం జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డిలను వారు శాలువాలతో సన్మానించారు. వాసర్ సమీపంలో రూ.125 కోట్లతో సమీకృత గురుకుల పాఠశాలను మంజూరు చేయించి, బుధవారం మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా శంకుస్థాపన చేయిస్తున్నందుకు గాను కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆర్డీఓ అశోక చక్రవర్తిని సైతం సత్కరించారు.



ఎమ్మెల్యే సంజీవరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

మెలకువలతో మంచి దిగుబడులు

- ఆలుగడ్డ సాగుపై ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సరిత, రాహుల్ సూచనలు

జహీరాబాద్: ఆలుగడ్డ సాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కె.సరిత, రాహుల్ విశ్వకర్మలు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని రాయిపల్లి(డి), హుగ్గెల్లిలో నిర్వహించిన సమావేశాల్లో ఆలుగడ్డ పంటలో రకాల ఎంపిక, విత్తన శుద్ధి, విత్తే పద్ధతి, ఎరువులు, కలుపు యాజమాన్య పద్ధతుల గురించి పేర్కొన్నారు. విత్తన పంట మొలిచిన తర్వాత మొక్కలపై మట్టిని ఎగదోసే పద్ధతి అనుసరించడం వల్ల నీరు, గాలి బాగా అందుతుందన్నారు. పెరిగిన దుంపను సూర్యరశ్మి నుంచి కాపాడటం వల్ల నాణ్యతతో పాటు మార్కెట్లో మంచి డిమాండ్ లభిస్తుందన్నారు. అంతే కాకుండా మంచి దిగుబడులను సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా పంటలో చేపట్టాల్సిన చీడపీడలు, తెగుళ్ల నివారణ చర్యల గురించి వివరించారు. ఈ మధ్య పంటలో అక్కడక్కడ ఆకులు వడలిపోయినట్లు ఉండి గిడసబారి దుంప పరిమాణం తగ్గడం గమనించామన్నారు. ఈ యొక్క లక్షణాలు ఆకుతినే, దుంప తొలిచే పురుగు వల్ల వస్తుందన్నారు. ఆపై నివారణ చర్యలను తెలిపారు. అనంతరం సోయాబీన్‌లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు తెలిపారు. కార్యక్రమంలో జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల వ్యవసాయాధికారులు లావణ్య, వినోద్‌కుమార్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

వ్యవసాయంలో మహిళల పాత్ర అమోఘం

వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర ఎనలేనిదని, వారి కృషి అమోఘమైందని కేవీకే శాస్త్రవేత్త వరప్రసాద్ అన్నారు. మంగళవారం జహీరాబాద్ మండలం దిడిగిలో గల కేవీకేలో మహిళా కిసాన్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో అధిక శాతం మహిళలే భాగస్వామ్యం వహిస్తున్నారని అన్నారు. తొలుత ఆంధ్ర.. విజయవాడ లయోలా కళాశాల విద్యార్థులు వివిధ రకాల వ్యవసాయ సాంకేతిక ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఫలపరిశోధనా కేంద్రం, బసంత్‌పూర్ వ్యవసాయ పరిశోధానా కేంద్రాలకు చెందిన అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వికటించిన వైద్యం..

- భార్యకు అనారోగ్యం - ప్రైవేటు ఆస్పత్రిపై భర్త ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: వైద్యం వికటించడం వల్ల భార్య అనారోగ్యానికి గురైందని సదరు ప్రైవేటు ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితురాలి భర్త కిరణ్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీ రోడ్ నంబర్ 3లో నివాసం ఉండే కిరణ్ కుమార్, సౌమ్య దంపతులు. ఆమె గత నెల 19న ముత్తంగిలో ఉండే బంధువుల ఇంటికి వెళ్లింది. ఇక్కడ సౌమ్య జ్వరం, ఒళ్లు నొప్పులు బారిన పడడంతో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకు వెళ్లగా వైద్యులు పరీక్షించి ఇంజక్షన్ ఇచ్చాడు. ఆ తర్వాత రోజు నుంచి ఇంజక్షన్ వేసిన చోట గడ్డకట్టి నొప్పితో పాటు నడవడానికి ఇబ్బంది పడింది. మరలా డాక్టర్‌ను సంప్రదిస్తే మాత్రలు రాసి వాడండి తగ్గిపోతుందని చెప్పారు. అయినా ఆమె ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళితే ఇక్కడ వైద్యులు రిపోర్టుల ఆధారంగా ఆపరేషన్ అవసరం ఉంటుందని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని రిఫర్ చేశారు. ఇక్కడికి వెళ్తే ఆపరేషన్ చేశారు. ఈ విషయమై ప్రైవేటు ఆస్పత్రి యజమాన్యం, వైద్యులను సౌమ్య భర్త కిరణ్ నిలదీశారు. వారు ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ బెదిరించారని ఆయన తెలిపాడు. తన భార్యకు సరైన వైద్యం చికిత్స చేయలేదని దీంతో ఆపరేషన్ చేయించాల్సి వచ్చిందని ఈ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం పటాన్‌చెరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ వివరణ కోరగా.. జిల్లా వైద్యాధికారిని సంప్రదించి, ఆయనిచ్చే నివేదిక ఆధారంగా కేసు నమోదు చేస్తామన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన సంఘటన పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మహబూబాబాద్‌కు చెందిన మధు (27) ఈనెల 11న పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉండే బంధువుల వద్దకు వచ్చి ఇక్కడే పనికి కుదిరాడు. 14వ తేదీ మధ్యాహ్నం పనిచేసే చోట కడుపునొప్పితో బాధపడుతుండటంతో పటాన్‌చెరులో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు రాగా ఇక్కడ చికిత్స పొందుతూ అదే రోజు మృతిచెందాడు. పోలీసులు ఇక్కడికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలోను..

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందిన సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం పాటీ చౌరస్తా సమీపంలో 65–70 ఏళ్ల వయసు గల వృద్ధుడు అనారోగ్యంతో రోడ్డుపై పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఇక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మూడు రోజుల క్రితం భిక్షాటన చేసుకుంటూ కనిపించాడని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



వృద్ధుడి మృతదేహం

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కొండాపూర్(సంగారెడ్డి): నీటి సహాయకులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఈఈ షేక్ పాషా అన్నారు. మండల కేంద్రమైన కొండాపూర్‌లో మంగళవారం గ్రామ మంచి నీటి సహాయకుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ శిబిరం నాలుగు రోజుల పాటు జరుగుతోందన్నారు. చివరి రోజు నీటి నాణ్యత తెలుసుకోవడానికి చేసే పరీక్షల గురించి వివరిస్తామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా సమస్య వస్తే వెంటనే పరిష్కరించాలన్నారు. ఏఈ రవికుమార్, డీఈఈ సుచరిత, వర్క్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ముంగి చౌరస్తా వద్ద పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్పీ రూపేశ్ ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో జహీరాబాద్ రూరల్ సీఐ బి.హన్మంత్, హద్నూర్, రాయికోడ్ ఎస్‌లు రామానాయుడు, నారాయణ, సిబ్బంది తనిఖీ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ హన్మంత్ మాట్లాడుతూ వాహనచోదకులు ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లను కలిగి ఉండాలన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ తదితరులు